రైతులను దోచేస్తున్నారు..



పై చిత్రంలో కన్పిస్తున్న లక్ష్మణచాందకు చెందిన ఓస రాహుల్ అనే ఈ యువ రైతు యాసంగిలో 11 ఎకరాల్లో వరి సాగు చేశాడు. పంట చేతికిరాగా స్థానికంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 552 బస్తాల (బస్తా 40కిలోలు) ధాన్యం విక్రయించాడు. మిల్లుకు ధాన్యం తరలించగా 552 బస్తాలకు గాను 537 బస్తాలకే రసీదు ఇచ్చారు. నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని 15 బస్తాలను(ఆరు క్వింటాళ్లు) కోత విధించారు. ఖాళీ సంచి బరువు 500 గ్రాములు. కొనుగోలు కేంద్రంలో బస్తాలో 41.5 కిలోల ధాన్యాన్ని తూకం వేస్తూ 40.5 కిలోలను మాత్రమే లెక్కలోకి తీసుకుంటున్నారు. ఇలా అదనంగా మరో 552 కిలోలను నష్టపోయానని రాహుల్ పేర్కొన్నాడు. ఇలా కోత పేరిట మొత్తం 11.52 క్వింటాళ్ల ధాన్యాన్ని సుమారు రూ.25,378 నష్టపోయానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ పరిస్థితి ఈ ఒక్క రైతుదే కాదు..జిల్లా అంతటా కొనుగోలు కేంద్రాల్లో ఇదే తీరు ఉందని అన్నదాతలు పేర్కొంటున్నారు.



లక్ష్మణచాందలో వరి ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

- కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కు
- 40 కిలోల సంచికి రెండు కిలోల వరకు కోత
- ఆందోళనలో అన్నదాతలు
- కోతల్లేకుండా చూడాలని వేడుకోలు

లక్ష్మణచాంద: విత్తనం కొన్నప్పటి నుంచి సాగు చేసిన పంటను కొనుగోలు కేంద్రంలో అమ్ముకునే వరకు రైతు ప్రతి సందర్భంలో మోసపోతూనే ఉంటున్నాడు. కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు పాటించకుండా నిర్వాహకులు, ఇటు రైస్‌మిల్లర్లు కుమ్మక్కై దోపిడీ చేస్తున్నారని జిల్లా రైతులు ఆందోళన చెందుతున్నారు. నాణ్యత పేరిట తప్ప, తాలు, బియ్యం విరుగుతున్నాయనే కారణాలు చెప్పి 40 కేజీల ఒక్కో సంచికి కిలో నుంచి 2 కిలోల ధాన్యాన్ని కోత విధిస్తున్నారని వాపోతున్నారు.

జిల్లాలో..

జిల్లాలో యాసంగిలో 85 వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. చాలా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై అన్నదాతల రాబడిని దోచేస్తున్నారు. జిల్లాలో మొత్తం 225 వరి కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి.



40 కిలోలు ఉండాల్సిన చోట 41.6 కేజీల తూకం

పీఏసీఎస్ ఆధ్వర్యంలో 92 కొనుగోలు కేంద్రాలు, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 76 కొనుగోలు కేంద్రాలు, డీఆర్డీఏ ఆధ్వర్యంలో 52 కొనుగోలు కేంద్రాలు, ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఐదు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కోత కామనే...

ప్రతీ ఏడాది ధాన్యం కొనుగోళ్ల సమయంలో కోత విధించడం కొనసాగుతూ వస్తోంది. గత డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ కోత లేకుండా తూకం వేశారని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం యాసంగి పంటకు 40 కిలోల బస్తాకు కిలో నుంచి కిలోన్నర వరకు ఎక్కువ తూకం వేస్తున్నారు. దీనికి తోడు ఒక లారీని రైస్‌మిల్లర్‌కు పంపితే నాణ్యత ప్రమాణాల పేరిట క్వింటాలుకు 2 నుంచి 3 కిలోల వరకు కోత విధిస్తుండగా.. ఇలాక్వింటాల్ ధాన్యానికి నాలుగు నుంచి ఆరు కిలోల వరకు ధాన్యం నష్టపోవాల్సి వస్తుందని అన్నదాతలు వాపోతున్నారు.

అధికారులు, పాలకులు స్పందించాలి..

ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు పాటించేలా చూడాలని రైతులు కోరుతున్నారు. నిబంధనలు పాటించని నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

కోత లేకుండా చూడాలి



ఆరుగాలం కష్టించి పనిచేస్తే చేతికొచ్చిన పంటలో క్వింటాల్‌కు 4 నుంచి 6 కిలోలు కటింగ్ చేస్తున్నారు. దీంతో రైతులం తీవ్రంగా నష్టపోతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి కొనుగోలు కేంద్రంలో నిబంధనలు పాటించి కోతలు లేకుండా చూడాలి.

– సర్సారెడ్డి, లక్ష్మణచాంద

నిబంధనలు పాటించాల్సిందే..

రైతులు తూర్పార పట్టిన తర్వాతే పంటను కేంద్రానికి తీసుకురావాలి. కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు విధిగా నిబంధనలు పాటించాల్సిందే. కనీస సౌకర్యాలు కల్పించి తూకంలో మోసం లేకుండా చర్యలు చేపట్టాలి. ఇటీవల రైస్‌మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని, కోతలు విధించవద్దని ఆదేశించాం. నాణ్యత ప్రమాణాలు పాటించిన తర్వాత కూడా కోత విధిస్తే రైతులు ఫిర్యాదు చేయాలి. తప్పకుండా వారిపై చర్యలు తీసుకుంటాం.

– కిశోర్‌కుమార్, అదనపు కలెక్టర్

క్లుప్తంగా

16న మండల సర్వసభ్య సమావేశం

కుభీర్: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 16న గురువారం కుభీర్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తూము లక్ష్మీబాయి, ఎంపీడీవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష జరుపనున్నట్లు పేర్కొన్నారు.

‘బీఆర్ఎస్ శ్రేణులకు ధన్యవాదాలు’

ఖానాపూర్: రాష్ట్రంలోని ప్రజాసమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక ఉండాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సక్కు గెలుపు కోసం పార్టీ శ్రేణులు చేసిన కృషి మరువలేనిదని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

‘ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి’

ఖానాపూర్: వడ్డెర కులస్తులపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వడ్డెర సంఘం సోషల్‌మీడియా రాష్ట్ర కన్వీనర్ బోసు రాము డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎస్టీలుగా ఉన్న వడ్డెరలను బీసీలో చేర్చడంతో అణచివేతకు, అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్‌లో ఒడ్డెర కులస్తులపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

సన్మానం



నజీమ్‌ను సన్మానిస్తున్న నారాయణ్‌రావు

ముథోల్: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎస్.కే నజీమ్ మంగళవారం మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపాటిల్ ఘనంగా సన్మానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సోషల్‌మీడియాలో కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముఖ్యపాత్ర పోషించినందుకు అభినందించాడు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బెజ్జంకి ముత్యం రెడ్డి, అజీజ్, దిగంబర్, అబ్దుల్‌వాజ్ తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షకుడికి ముథోల్ ఎమ్మెల్యే ప్రశంస



పోతన్నను అభినందిస్తున్న ఎమ్మెల్యే

భైంసాటౌన్: మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన రాటి పోతన్న అంతర్జాతీయ గుర్తింపు పొందిన యోగా శిక్షణ సంస్థ ఎస్ వ్యాస యోగ యూనివర్సిటీలో వంద రోజుల శిక్షణ పూర్తి చేసుకున్నారు. దీంతో యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ పొందగా..ఈ మేరకు ఎమ్మెల్యే రామారావుపటేల్ అభినందించారు. మంగళవారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో ఎమ్మెల్యేను కలువగా.. శాలువాతో సత్కరించారు. యూనివర్సిటీ నుంచి వచ్చిన సర్టిఫికెట్ అందజేసి అభినందించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కుంటాల:రానున్న రెండు రోజుల్లో అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించిందని.. రైతులు అప్రమత్తంగా ఉండాలని డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్లాల ఎదుట ఉన్న ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలస్యంగా వరి కోతలు



పొలం కోస్తున్న హార్వెస్టర్

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. యాసంగిలో ఆలస్యంగా రైతులు పొలంనాట్లు వేయడంతో పంట చేతికి వచ్చేందుకు జాప్యం అవుతుంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పొలంలో వడ్లు నేలరాలుతున్నాయి. దీంతో రైతులు మమూలు హార్వెస్టర్లతోపాటు బురద ఉన్న చోట చైన్ మిషన్లతో వరికోతలు చేపడుతున్నారు.

ముథోల్ పోలింగ్ 75.64 శాతం

- తానూర్ మండలంలో అధికం
- భైంసా పట్టణంలో అత్యల్పంగా నమోదు

భైంసాటౌన్: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగిన పోలింగ్‌లో ముథోల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 75.64 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,54,579 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 1,92,546 మంది ఓటేశారు. మండలాల వారీగా పరిశీలిస్తే తానూర్ మండలంలో అధికంగా 81.80 శాతం పోలింగ్ నమోదవగా.. భైంసా పట్టణంలో తక్కువగా 62.06 శాతం నమోదైంది. భైంసా పట్టణంతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లోనే పోలింగ్ శాతం మెరుగ్గా ఉంది. గత పార్లమెంట్ (2019)ఎన్నికల్లో ముథోల్ నియోజకవర్గం నుంచి 1,66,443 ఓట్లు పోలవగా, బీజేపీకి 75,216, కాంగ్రెస్‌కు 41,349, బీఆర్ఎస్‌కు 44,212 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి సోయం బాపురావు 58 వేలకుపైగా మెజారిటీతో గెలుపొందగా.. ముథోల్ నుంచే 30వేల పైచిలుకు మెజారిటీ సాధించారు. దీంతో ఈసారి సైతం ఆ పార్టీ ముథోల్ నియోజకవర్గ ఓటర్లపై భారీగా ఆశలు పెట్టుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు సైతం విజయావకాశాలపై ధీమాగా ఉన్నారు.

మండలాల వారీగా పోలింగ్ ఇలా...

మండలం	మొత్తం ఓటర్లు	పోలైనవి	శాతం
కుభీర్	39,814	30,472	76.53
కుంటాల	28,024	21,578	77.00
భైంసారూరల్	33,409	26,350	78.90
భైంసా పట్టణం	49,497	30719	62.06
లోకేశ్వరం	29,657	23,702	79.92
ముథోల్	27,602	21,760	78.83
బాసర	15,419	12,476	80.91
తానూర్	31,157	25,489	81.80
మొత్తం	2,54,579	1,92,546	75.64

మూడు గ్రామాల్లో 80 శాతానికి పైగా పోలింగ్

లక్ష్మణచాంద: పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఓటేసేందుకు పోటెత్తారు. తిర్పెల్లి గ్రామంలో 565 మంది ఓటర్లు ఉండగా 475 మంది ఓటేయగా 84 శాతం పోలింగ్ నమోదైంది. కనకాపూర్‌లో 1086 మంది ఓటర్లకు గాను 906 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 83 పోలింగ్ నమోదైంది. పొట్టపెల్లి(కే)లో 729 మంది ఓటర్లు ఉండగా 600 మంది తమ ఓటు వినియోగించుకోగా 82.3 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం 24,163 మంది ఓటర్లు ఉన్నారు. మహిళలు 12,982 మంది ఓటర్లు ఉండగా 10,734 మంది(82శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.మండలంలో పురుషులు 11,180 మంది ఓటర్లు ఉండగా ఇందులో కేవలం 8182 (73శాతం) మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



లక్ష్మణచాందలో బారులు తీరిన ఓటర్లు

ఈసారి పురుషులు..!

- ముథోల్ నియోజకవర్గంలో ఓటేయడంలో వారే ముందు
- లోకేశ్వరం, కుంటాల మినహా అన్నిచోట్లా అధిక పోలింగ్

భైంసాటౌన్: ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గం పరిధిలో మహిళలు అధిక సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోగా పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం మగ మహరాజులు ఓటు వేయడంలో చైతన్యం కనబరిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో ముందంజలో ఉన్న మహిళలు పార్లమెంట్ ఎన్నికల్లో కాస్త వెనుకబడ్డారు. పురుషులు అధికసంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తి చాటారు. ముథోల్ నియోజకవర్గంలో మహిళా ఓటర్లు సంఖ్యాపరంగా అధిక సంఖ్యలో ఉన్నా.. ఓటు వేయడంలో మాత్రం పురుషులే ముందంజలో ఉన్నారు. నియోజకవర్గంలో 1,23,583 మంది పురుష ఓటర్లు ఉండగా, వీరిలో 93,995(76.05 శాతం) మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 1,30,978 మంది మహిళా ఓటర్లకుగాను 98,549 (75.24శాతం) మంది ఓటు వేశారు. లోకేశ్వరం, కుంటాల మండలాల్లో మహిళల పోలింగ్ శాతం అధికంగా ఉండగా..కుభీర్, భైంసారూరల్, పట్టణం, ముథోల్, బాసర, తానూరు మండలాల్లో పురుషులు అధిక సంఖ్యలో ఓటేశారు.

మండలాలవారీగా వివరాలు..

మండలం	మొత్తం ఓట్లు		పోలైనవి	
	పురుషులు	మహిళలు	పురుషులు(శాతం)	మహిళలు(శాతం)
కుభీర్	19,462	20,351	15,068(77.42)	15,404(75.69)
కుంటాల	13,416	10,608	10,256(76.44)	11,322(77.50)
భైంసా(రూ)	16,039	17,368	12,699(79.17)	13,650(78.59)
భైంసా(ప)	24,738	24,750	15,701(63.46)	15,017(60.67)
లోకేశ్వరం	13,828	15,826	10,872(78.62)	12,830(81.06)
ముథోల్	13,278	14,322	10,527(79.28)	11,233(78.43)
బాసర	7,441	7,977	6,068(81.54)	6,408(80.33)
తానూరు	15,381	15,776	12,804(76.00)	12,685(75.00)
మొత్తం	1,23,583	1,30,978	93,995(76.05)	98,549(75.24)

ఈ గ్రామాల్లో పగలే వెన్నెల..



బెంబరలో వెలుగుతున్న బల్బు



హిప్నెల్లిలో వెలుగుతున్న హైమాస్టు దీపం

- మిట్టమధ్యాహ్నం వెలుగుతున్న వీధిదీపాలు
- ఆనాఫ్ ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

తానూరు: మండలంలోని బెంబర, హిప్నెల్లి గ్రామాల్లో మిట్ట మధ్యాహ్నం కూడా వీధిదీపాలు వెలుగుతూనే ఉన్నాయి. ఆయా గ్రామాల్లో అంతర్గత విద్యుత్ లైన్‌కు ఏర్పాటు చేసిన బల్బులకు ఆనాఫ్ పరికరాలు లేక రోజంతా వీధిదీపాలు వెలుగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య తలెత్తుతుంది. విద్యుత్ వృథాను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని.. ఇప్పటికైనా బజార్‌లైన్‌కు ఆనాఫ్ పరికరాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పచ్చని తోరణం

లోకేశ్వరం: వేసవిలో ఎక్కడ చూసిన ఎండిన చెట్లు, ఆకులు రాలి మోడు వారిన వృక్షాలు కనిపిస్తాయి. కానీ లోకేశ్వరం మండల కేంద్రం నుంచి రాయపూర్‌కాండ్లీ గ్రామం వెళ్లే మార్గంలో ఏపుగా పెరిగిన చెట్లు ఆకట్టుకుంటున్నాయి. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు పచ్చని తోరణాన్ని తలపిస్తున్నాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఆహ్లాదం పంచుతోంది. పలువురు వాహనదారులు ఈ చెట్ల కింద ఆగి సేదతీరుతున్నారు.



ఏపుగా పెరిగిన చెట్లు

చుక్కనీరుంటే ఒట్టు..!



కుంటాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇసుక వెళ్లకుండా.. భూగర్భజలాలు పెంపొందించేందుకు కుంటాల మండలంలోని కల్లూర్ వాగు వద్ద నీటిపారుదల శాఖ అధికారులు రూ.కోటి 15వేలతో చెక్ డ్యాం నిర్మించారు. తక్కువ ఎత్తులో నాసిరకంగా నిర్మాణం చేపట్టారు. రెండు నెలల కిందటే డ్యాంలో నీరు ఖాళీ అవడంతో పశువులు దాహార్తి తీర్చుకునేందుకు గోస పడుతున్నాయి. నీటితొట్టిలు నిర్మించి మూగజీవాలకు నీటిని అందించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. మురుగుతో దుర్గంధం..



భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మురుగునీటితో దుర్గంధం వెదజల్లుతోంది. బస్టాండ్‌లోని హోటల్ వెనుక ప్రాంతంలో మురుగు నీటి ప్రవాహం వెళ్లే మార్గం లేక ప్రహరీని ఆనుకుని ఖాళీ ప్రదేశంలో చేరుతోంది. దీంతో మురుగునీరు ఒకేచోట నిలుస్తుండటంతో దుర్గంధం వస్తోంది. సంబంధిత అధికారులు మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బోరుబావులను మూసేయాలి

లోకేశ్వరం: తెరిచి ఉన్న బోరుబావులను మూసివేయాలని మా అమ్మ-నాన్న ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ధర్మోరలో తెరిచి ఉన్న బోరుబావిని మాఅమ్మ-నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూసివేయించారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ రైతులు పంట పొలాల్లో వేయించిన బోరుబావిలో నీరు పడకుంటే నిర్లక్ష్యంగా వదిలేయకుండా.. మూసివేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్దకాపు భూమేశ్, గుండేగళ్ల కిరణ్ తదితరులు ఉన్నారు.



తెరిచి ఉన్న బోరుబావిని మూసి వేయిస్తున్న ఆంజనేయులు

ఆలయ వార్షికోత్సవం



ఆలయం వద్ద భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ మర్రిచెట్టు హనుమాన్ ఆలయంలో మంగళవారం ఆలయ రెండో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నుంచి పంచమృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వ్యాపారి ముత్యం సంతోష్ గుప్తా, మాజీ కౌన్సిలర్ డి.శ్రీనివాస్, అర్కరీ రాజేందర్, రాము, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సత్కారం

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బందోబస్తు చర్యలు నిర్వహించడానికి బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి వచ్చిన కేంద్ర భద్రతా బలగాలను మంగళవారం బుధాగెస్ట్ హౌజ్ ఆవరణలో సత్కరించారు. బీఎస్ఎఫ్ జీకాయ్, 160 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ డేవిడ్ లాల్‌కు సీపీ తరఫున బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి శాలువా కప్పి ఆత్మీయ సత్కారం చేశారు. మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ.. బెల్లంపల్లి నియోజకవర్గంలోని మావో యిస్టు ప్రభావిత ప్రాంతాల్లో, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అత్యంత సమర్థవంతంగా బీఎస్ఎఫ్ బలగాలు విధులు నిర్వర్తించాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, తాళ్లగురిజాల ఎస్సై నరేశ్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడి నవరాత్రి ఉత్సవాలు



స్వామివారు

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్, ఎలగడప, సారంగాపూర్ గ్రామాల సమీపంలో కొండగుహలో స్వయంబుగా వెలసిన అక్కకొండ లక్ష్మీనరసింహా స్వామి క్షేత్రంలో మంగళవారం నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. చందనోత్సవం, కలశాభిషేకం, శ్రీ తులసీ అర్చన, లక్ష్మీనరసింహా స్వామి నామార్చనలు నిర్వహించినట్లు అలయ ప్రధాన అర్చకులు వొద్దిపర్తి వెంకటరమణాచార్యులు తెలిపారు. ఈనెల 22 వరకు నవరాత్రి ఉత్సవాలు కొనసాగనున్నాయి.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి: వేసవిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కోఆర్డినేటర్ గుంజాల రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని భీంనగర్‌లో ప్రజలు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రతలపై మంగళవారం కళాకారులు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్యం, స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. కళాకారులు చహకటి రవి, కుమ్ర నగేశ్, ఆత్రం గోవింద్, శంకర్, ఆశిష్, మురళీ, రాజు, శ్రావణ్, శ్రీలత ఉన్నారు.